క్లుప్తంగా

పశువుల షెడ్ల నిర్మాణ పనుల పరిశీలన



గోపినాథపట్నంలో పశువుల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఉంగుటూరు: పశువుల షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో గంజిరా జీమనోజు తెలిపారు. బుధవారం గోపినాథపట్నం, యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, రామచంద్రపురం, నల్లమాడు, చేబ్రోలు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. పశువుల షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి రైతులను చైతన్యపరిచారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేస్తే వెంటనే గ్రాంటు అందజేస్తామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికార్లు , సహాయకులు, ఉపాధి ఫీల్డు సహాయకులు, ఎంపీడీవో పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



గొల్లగూడెంలో పారిశుద్ధ్య ప్రాధాన్యతపై ప్రచారం చేస్తున్న అధికారులు

ఉంగుటూరు: గొల్లగూడెంలో వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే అపరిశుభ్ర ప్రదేశాలను అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు ప్రజలకు పారిశుద్ధ్యం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య నియమాలు పాటించాలని కోరారు. వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య సహాయకులు వెంకటస్వామి, చంద్రకళా ఆశాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి



పెదపాడులో అధికారికి వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెదపాడు: పనిభారం తగ్గించాలని పెదపాడు ఎంపీడీవో అమీలు జమాకు, ఈఓఆర్డీ ఎస్ సూర్యకుమార్‌ను పంచాయతీ కార్యదర్శులు కోరారు. పెదపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు తమపై పని భారం పెరిగిందని బుధవారం వారు వాపోయారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో వారు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మేకా శ్రీనివాస్, మైనీడి వెంకటేశ్వరరావు, పద్మారావు గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంట కోత అనంతరం గడ్డికి నిప్పు పెట్టవద్దు

పెదపాడు: సార్వా కోతల అనంతరం పంట అవశేషాలకు నిప్పుపెట్టడం ద్వారా వాతావరణం కాలుష్యమవడంతోపాటు భూసారం తగ్గుతుందని వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్ తెలిపారు. పెదపాడు మండలంలో రైతులు తమ వరి పంటల అనంతరం తగుల బెడుతున్నారని దీని వల్ల సార్వా అనంతరం వేసే పంటకు కావాల్సిన పోషకాలు తగిన మోతాదులో అందించాలంటే భూమిలోని సూక్ష్మ జీవులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. పొలంలోని గడ్డిని తగులబెట్టడం ద్వారా భూమి వేడెక్కి సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. తద్వారా దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. యంత్రం సహాయంతో పొలంలోని గడ్డిని చుట్టలు చుట్టి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

జంగారెడ్డిగూడెం/కుక్కునూరు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబా బు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జంగారెడ్డి గూడెం మండలం లక్ష్మీపురంలో 39 సుంకం చెల్లించని తెలంగాణ మద్యం సీసాలతో గుమ్ములూరి ముసలయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. లక్కవరంలో 25 మద్యం సీసాలతో పులపాకల సత్యనారాయణ అనే వ్యక్తిపై, కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామంలో తోట వెంకటేశ్వరరావు నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఆరీఫ్ తెలిపారు.

బెల్ట్ షాపుపై దాడి

కొయ్యలగూడెం: కన్నాపురంలో ఎక్సైజ్‌శాఖ బుధవారం నిర్వహించిన దాడిలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై ఎల్.శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

అడుగడుగునా గోతులమయం

- అభివృద్ధికి నోచుకోని గణపవరం- కలవపూడి రోడ్డు
- 3 కిలోమీటర్ల మేర ఛిద్రం

గణపవరం: కొల్లేరు ప్రాంతంలో ప్రధానమైనదిగా ఉన్న గణపవరం – కలవపూడి ప్రధాన రహదారిలో కొంతమేర రోడ్డు అభివృద్ధికి నోచుకోక, అడుగడుగునా పెద్ద గోతులతో, అధ్వానంగా తయారై ప్రయాణికుల పాలిట యమగండంగా తయారైంది. ఈరోడ్డు మీద ప్రయాణం వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్డునిండా గోతులు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గణపవరం నుంచి ఆకివీడు వెళ్లడానికి దగ్గరిదారి కావడంతో నిత్యం ఈరోడ్డు మీదుగా పెద్ద సంఖ్యలో ప్రయాణికులు, వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గణపవరం నుంచి ఆకివీడు పట్టణం వరకూ సుమారు 20 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈరోడ్డును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గణపవరం నుంచి క్రొవ్విడి వరకూ అభివృద్ధి చేశారు. పెదకాపవరం నుంచి ఆకివీడు వరకూ రోడ్డును పటిష్టంగా నిర్మించారు. మధ్యలో క్రొవ్విడి నుంచి పెదకాపవరం వరకూ సుమారు 3 కిలోమీటర్ల మేర ఈరోడ్డు వెంబడి కాపవరం పంట కాలువ ప్రవహిస్తుంది.

అగాధాల్లాంటి గోతులు

కాలువ వెంబడి రోడ్డు తరచూ దిగబడిపోతుండటంతో శాశ్వత పరిష్కారంగా పంట కాలువకు రోడ్డుకు మధ్య ముందుగా రిటైనింగ్ గోడ నిర్మాణం చేపట్టారు. దీనితో ఆ మూడు కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం రిటైనింగ్ గోడ నిర్మాణం పూర్తయినా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొత్త రోడ్డు నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నారు. ఈలోగా 3 కిలోమీటర్ల మేర రోడ్డు నామరూపాలు లేకుండా పోయింది. ఈమూడు కిలోమీటర్ల పొడవునా ఈరోడ్డు అడుగడుగునా అగాధాల్లాంటి గోతులతో నిండిపోయింది. వాహనదారులు గోతులు తప్పించి వాహనాలు నడపడం డ్రైవర్లకు తలకు మించిన భారంగా మారింది. ఆదమరచి రోడ్డు మార్జిన్‌లోకి వెళ్తే వాహనాలు దిగబడిపోతున్నాయి. ఇటీవల చేపల లోడుతో వెళ్లే లోడు లారీలు రోడ్డు మార్జిన్‌లో, రోడ్డుమీద ఉన్న గోతుల్లోనూ దిగబడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వాహనాల యాక్సిల్స్, చక్రాల ఇరుసులు విరిగి రోడ్డుకు అడ్డంగా మొరాయించిన వాహనాలు కూడా దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, మినీ లారీలు, ట్యాక్సీలు అయితే మూడు కిలోమీటర్ల రోడ్డు దాటడానికి కనీసం అరగంటకు పైగా సమయం పడుతుంది. ఈరోడ్డు మీద నిత్యం ప్రయాణించే సమీపంలోని పెదకాపవరం, చినకాపవరం, కోళ్లపర్రు, క్రొవ్విడి, బావాయిపాలెం, ఉప్పరగూడెం గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో ఈరోడ్డుపై ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. నిడమర్రు, ఆకివీడు, మండలాల్లోని కొల్లేరు ప్రాంతంలో వేలాది ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారు. దీనితో ఈ రోడ్డుపై నిత్యం చేపలు, రొయ్యల చెరువులకు మేతలు, చేప, రొయ్య సీడ్, పట్టుబడి చేసిన సరుకుతో వాహనాలు ఈరోడ్డు మీదుగానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఆకివీడుకు వెళ్లే ఆర్టీసీ బస్‌లు కూడా ఈగోతుల రోడ్డు మీదే వెళ్లాల్సి వస్తుంది. ఈ మూడు కిలోమీటర్ల రోడ్డుకు భయపడి వాహనదారులు చుట్టూతిరిగి ఉండిమీదుగా ఆకివీడు వెళ్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని ఈరోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించి ప్రయాణీకులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌లో దిగబడిన లోడు లారీ (ఫైల్)



గోతులమయమైన ఆకివీడు - గణపవరం రోడ్డు



గత ప్రభుత్వ హయాంలో పంట కాలువ వైపు నిర్మించిన రక్షణ గోడ



గోతుల్లో పడుతూ లేస్తూ వెళ్తున్న వాహనాలు

రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

పెదవేగి : పెదవేగి 232 కేవీ ఫీడర్ ప్రస్తుతం ఉన్న కండక్టర్ మార్పు చేసే పనులు చేపట్టిన దృష్ట్యా ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రోజూ రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్, కె.యం.అంబేడ్కర్ తెలిపారు. 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, పెదవేగి పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాలకు చెందిన వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

మరియ థెరిస్సాకు సన్మానం

దెందులూరు: ఆధ్యాత్మిక అభివృద్ధి, సేవ తత్పరత, సంఘ సేవతో కృషి చేస్తున్న ప్రొవెన్షియల్ మరియ థెరిసా అభినందనీయురాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజా అన్నారు. బుధవారం దెందులూరు సెయింట్ మేరీ యూపీ పాఠశాలలో ఫ్రాన్సిస్ ఎఫ్‌సీసీ సభలో ప్రొవెన్షనల్‌గా నియమితులైన మరియ థెరిసాను దెందులూరులో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత ప్రొవెన్షనల్ మరియా థెరిస్సా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, ఉపాధ్యాయులు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేయాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం సిస్టర్ టీనా, ఉపాధ్యాయులు ఉన్నారు.

6 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

దెందులూరు: రెవెన్యూ సదస్సులు ఈనెల 6 నుంచి జనవరి నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దెందులూరు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల నమోదు పరిష్కారం లక్ష్యంగా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేలు రెవెన్యూ సదస్సులకు సిద్ధం కావాలన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉంగుటూరు : బాదంపూడికి చెందిన నక్క అప్పయమ్మ (78) బుధవారం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. నవంబరు 28న ఇంటి వద్ద మనవడితో ఫోన్‌లో మాట్లాడుతూ మెట్లపై నుంచి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. ఆమెను స్థానికులు తాడేపల్లిగూడెం , ఏలూరు, విజయవాడ ఆసుపత్రులకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం అప్పయమ్మ చనిపోయినట్లు ఎస్సై తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

ఉంగుటూరు: నారాయణపురం సెంటర్లో రాజ్యలక్ష్మి వైన్ షాపు పక్కన 765 మద్యం సీసాలను అక్రమంగా విక్రయిస్తుండగా విజయవాడ స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. 60 బీర్లు, 705 ఇతర బ్రాండ్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెండురోజుల పాటు మద్యం విక్రయాలను నిలిపివేసి షాపులను మూసివేశారు. కొందరు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించి దాడులు చేస్తున్నారు. బ్రాందీషాపునకు పక్కనే ఉన్న షెడ్డులో మద్యం సీసాలు ఉంచి విక్రయిస్తుండగా పట్టుకున్నట్టు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

- నిర్మాణ పనుల్లో రాజీ పడవద్దు
- నాణ్యత పరిశీలించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

దెందులూరు/ పెదవేగి : రోడ్డు నిర్మాణ పనుల్లో రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె .వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం దెందులూరు మండలం శ్రీరామవరం, పెదవేగి మండలం ముండూరులో రోడ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నాణ్యత, పొడవు, వెడల్పు, అంచనా ఖర్చు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామవరానికి చెందిన కామిరెడ్డి సోము బ్రహ్మం కలిసి కలెక్టర్ రోడ్ల నిర్మాణ పనులపై ఆరా తీశారు. సీసీ రోడ్లు పది రోజుల్లో పూర్తి చేస్తారని తెలిపారు. శ్రీరామవరం నుంచి తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతు పనులు కొనసాగిస్తున్నామని ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే వివరించారు. రోడ్డుకు డ్రైయినేజీ నిర్మాణానికి కొంతమేర స్థలాన్ని వదులుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో రోడ్డు పరిస్థితి, మరమ్మతుల తర్వాత ఉన్న పరిస్థితికి సంబంధించిన ఫొటోలను అందజేయాలని చెప్పారు.నిర్దేశించిన గడువులోగా చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.



పెదవేగి మండలం ముండూరులో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రశాంతంగా నాస్ సర్వే పరీక్ష

భీమడోలు: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను గుర్తించేందుకు దేశ వ్యాప్తంగా బుధవారం చేపట్టిన ఫరక్ రాష్ట్రీయ పర్యవేక్షణ్ 2024 సర్వే మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో ఎంపిక చేసిన ఆరు పాఠశాలల్లోని 3, 6,9వ తరగతులకు చెందిన విద్యార్థులకు భాష, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాల సాధనపై పరీక్షను నిర్వహించారు. గుండుగొలను, భీమడోలు, ఎంఎంపురం, పూళ్ల ఉన్నత పాఠశాలలు, పాలేటి పాఠశాల, అన్నేవారిగూడెం పాఠశాలల్లోని 144 మంది విద్యార్థినీ విద్యార్థులు ఓఎంఆర్ షీట్లతో ప్రశ్నలకు సమాధానాలను పూరించారు. ఈ సర్వేలో నిర్వహించిన పరీక్ష నిర్వహణను తీరును భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. సర్వేను హెచ్ఎం పాశం పాండురంగారావు, ముక్కెల్లి శేఖర్, సీఆర్‌పీ చిలకంటి వెంకట రమణ పర్యవేక్షించారు. విద్యార్థులు పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారి సామర్థ్యాలను గుర్తించి అందులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాసంస్కరణలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందని విద్యాశాఖాధికారి ఈదుపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.



భీమడోలులో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

విశిష్ట సేవలకు గుర్తింపుగా పురస్కారాలు

దెందులూరు: విభిన్న ప్రతిభావంతుల సాధికారతపై విశిష్ట సేవలందిస్తున్న కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్లపూడికి జిల్లా కలెక్టర్ కే.వెట్రిసెల్వి అవార్డును ప్రదానం చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని కర్లపూడికి జిల్లా కలెక్టర్ అవార్డును ప్రశంస పత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సంబర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, సంక్షేమ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రామకుమార్, అధికారులు ఉన్నారు.





హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, సత్యనారాయణను సత్కరిస్తున్న కలెక్టర్

ఉంగుటూరు: కైకరం గ్రామానికి చెందిన కోనే వీర వెంకటసత్యనారాయణకు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఏలూరులో కలెక్టర్ కె.వెట్రిసెల్వి శాలువా కప్పి సత్కరించారు.

షష్ఠి మహోత్సవాలకు రంగం సిద్ధం



కైకరంలోని నాగమ్మతల్లి ఆలయం



నాగమ్మతల్లి

ఉంగుటూరు: కైకరం నాగమ్మ తల్లి ఆలయంలో షష్ఠి తిరునాళ్ల ఉత్సవాలకు రంగం సిద్ధం చేశారు.ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వారం రోజుల పాటు షష్ఠి తిరునాళ్ల నిర్వహిస్తారు. ఈమేరకు ఉత్సవ కమిటీ సభ్యులు తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. 6వ తేదీ రాత్రి 1.15 గంటలకు కల్యాణం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు నాగమ్మ తల్లికి ఉదయం, సాయంత్రం విశేష పూజలు నిర్వహిస్తారు.

పల్లెల్లో తిష్ట వేసిన బెల్ట్ షాపులు

- కూటమి పాలనలో కిక్కే..కిక్కు
- బెల్ట్ షాపులు లేవంటున్న ఎక్సైజ్ అధికారులు
- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

పెదవేగి : మద్యం బెల్ట్ దుకాణాలను నిషేధించామని చెబుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోంది. మండలంలోని ప్రతి పల్లెలో బెల్ట్ దుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా మద్యం పల్లెల్లో ఏరులై ప్రవహిస్తోంది. ఇంత జరుగుతున్నా, జిల్లా ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులను పూర్తిగా నిరోధించామంటూ చెబుతూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. పెదవేగి మండలంలో రామచంద్రపురం, పెదవేగి, కవ్వగుంట, విజయరాయి, వేగివాడ, ముండూరు, కూచింపూడి, కొప్పాక, రాట్నాలకుంట మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.పెదపాడు మండలంలో వట్లూరు, కలపర్రు, అప్పనవీడు, పెదపాడులో 2 మొత్తం 5 షాపులు, దెందులూరు మండలంలో రామారావుగూడెం, దెందులూరు, కొవ్వలి, గోపన్నపాలెం, పోతునూరు, మొత్తం 5 షాపులకు ప్రభుత్వం లైసెన్స్‌లు ఇచ్చింది. వీటి ద్వారా దరఖాస్తులు, లైసెన్స్ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. మద్యం షాపుల నిర్వహణలో వ్యాపారులు నిబంధనలను ఖాతరు చేయడం లేదు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణదారులు ఎక్కడా బెల్ట్ షాపులను ఏర్పాటు చేయరాదు. ప్రభుత్వం బెల్ట్ దుకాణాలపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. కానీ మద్యం వ్యాపారులు నిబంధనలను తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో ఎనిమిది, నుంచి 10 దుకాణాల వరకు ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. మండల కేంద్రమైన పెదవేగిలో రాజులపాటివారిగూడెం, ఎస్సీ కాలనీ, పెట్రోల్ బంక్ సమీపంలో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి, మద్యం ఏరులై పారిస్తున్నారు. మండలంలోని కూచింపూడి, కొప్పాక, రామశింగవరం, రాట్నాలకుంట, వేగివాడ, నడిపల్లి, బోగాపురం, అమ్మపాలెం, దిబ్బగూడెం, నాగన్నగూడెం, జానంపేటలో గొలుసు దుకాణాలు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగిలిన ప్రాంతాల్లో ఎలా ఉంటుందో ఊహించవచ్చు. బెల్ట్ దుకాణాల్లో లూజు, చీప్ లిక్కర్ విక్రయాలు బహిరంగానే జరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులకు అన్నీ తెలిసినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి బెల్టు దుకాణాలను పూర్తిగా తొలగించాలని మండల వాసులు, మహిళలు వేడుకుంటున్నారు.



బి శింగవరం ప్రధాన కూడలిలోని బెల్ట్ షాప్‌లోని మద్యం సీసాలు



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

భీమడోలు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు అన్ని పూర్తి ఏర్పాట్లు చేసారు. గతేడాది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కారణంగా ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికను ఎన్నికల కమిషన్ చేపడుతుంది. ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు అభ్యర్థులున్నారు. భీమడోలు – 1 ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకునేలా ఏర్పాటు చేసారు. బ్యాలెట్ పద్ధతిలో ఉపాధ్యాయులు తమ ఓటును ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులకు ఓటు వేసుకుంటారు. బుధవారం భీమడోలు పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను తహసీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు. సంబంధిత ఎన్నికల అధికారులకు సూచనలందించారు. మండలంలోని ఓటు నమోదు చేసుకున్న ఉపాధ్యాయులంతా పోలింగ్ కేంద్రంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు వేసుకునేందుకు అనుమతిస్తారు. మండలంలో 91 మంది ఓటర్లలో పురుషులు 52 మంది, మహిళలు 39 మంది ఉన్నారు. ప్రిసైడింగ్ అధికారిగా భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి వ్యవహరిస్తారు. ఎన్నికల అధికారులుగా మండల వ్యవసాయాధికారి, ఎంపీడీవో కార్యాలయ ఏవో, సీనియర్ అసిస్టెంట్లను నియమించారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ ఏర్పాటు చేసారు. నూరుశాతం ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు. జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ జెడ్పీ ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటించారు. యూపీ పాఠశాలల్లోని టీచర్ల తమ ఓటు వేసుకునేందుకు స్పెషల్ సాధారణ సెలవును వినియోగించుకోవాలని కోరారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని ఉంగుటూరు 69, నిడమర్రు 27 మంది ఓటు వేయనున్నారు. ఎన్నికల నేపథ్యంలో భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని 22 బ్రాందీ షాపులను మూసి వేసామని సీఐ బి.సత్యనారాయణ తెలిపారు.



భీమడోలు పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.రమాదేవి



భీమడోలులో మద్యం షాపును మూసి వేసిన ఎక్సైజ్ అధికారులు

నేడు ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం

పెదపాడు: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పెదపాడు తహసీల్దార్ కృష్ణ జ్యోతి తెలిపారు. పెదపాడు మండలంలోని 23 గ్రామాలకు చెందిన ఓటర్లుకు పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ చెప్పారు.